ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 16.06.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని రైతు వేదికల ద్వారా రాయితీపై సన్న వరి విత్తనాలను, బోనస్‌ను రైతులకు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
2. తెలంగాణలో పలు అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు హైదరాబాద్ మెట్రో ఫేజ్ -IIను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు.
3. కాంట్రాక్టర్లు తమ నిరసనను విరమించుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. మూడు నెలల్లోగా వారి బిల్లులను చెల్లిస్తామని మంత్రి స్పష్టం చేశారు.
4. రాగల కొన్ని రోజుల పాటు తెలంగాణాలోని పలు ప్రాంతాల్లో తెలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

**ముఖ్యమంత్రి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ సమీక్ష సమావేశంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ రాయితీలతో రైతు వేదికల వద్ద అందుబాటులో ఉన్న ఏడు రకాల సన్న వరి వంగడాలకు బోనస్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. సన్న వరిని సాగు చేసే రైతుల వివరాలను సేకరించి, అధునాతన సాంకేతికను అనుసంధానించాలని అధికారులను కోరారు. ధాన్యం సేకరణ సమన్వయం కోసం అగ్రికల్చరల్ యూనివర్సిటీని నోడల్ ఎజెన్సీగా ఉపయోగించుకోవాలని సూచించారు. అదనపు జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో రైతు వేదికల

ద్వారా బుక్ చేసుకున్న యూరియాను పంపిణీ చేసేందుకు ప్రత్యేక ఫర్టిలైజర్ యాప్‌ను ప్రారంభించాలని కోరారు. రామగుండంలో ఉత్పత్తి అయ్యే ఎరువులన్నీ తెలంగాణాకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

పీటీసీ హైదరాబాద్

**కిషన్ రెడ్డి**

తెలంగాణలోని అభివృద్ధి ప్రాజెక్టులను హైదరాబాద్ మెట్రో రెండో విడత పనులను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మెట్రో ఫేజ్ -II ప్రాజెక్టుకు 50:50 నిష్పత్తిలో నిధులు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా సాంకేతికత, సాధ్యాసాధ్యాల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. గతంలో మెట్రో మొదటి విడత కోసం కేంద్రం ఒక వెయి 2 వందల యాబై కోట్ల రూపాయలు అందించడంతో పాటు జాతీయ రహదారులు నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించిందన్న విషయాన్ని గుర్తు చేశారు.

డెస్క్

**BJP**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసమే రేవంత్ రెడ్డి కేంద్రమంత్రిని లక్ష్యంగా చేసుకుని నిరాధారమైన విమర్శలు చేస్తున్నారని

ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పూర్తిగా విఫలమైందని ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసం కేంద్రమంత్రిపై రేవంత్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

**డెస్క్**

**వివేక్**

తెలంగాణవ్యాప్తంగా ఉన్న హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక హమాలీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించనున్నట్లు రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. ప్రతిపాదిత బోర్డు ద్వారా కార్మికుల సంక్షేమం , కనీస వేతనాలు , గుర్తింపు కార్డుల జారీ , బీమా సౌకర్యం , సామాజిక భద్రత వంటి కీలక అంశాలపై సమగ్రంగా దృష్టి సారించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

డెస్క్

**సమాచారహక్కు చట్టం**

పారదర్శకత కోసం సమాచార హక్క చట్టానికి ప్రాధన్యత ఇవ్వాలని పెద్దపల్లి జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి ఆదేశించారు. 30 రోజుల్లోపు సమాచారం పొందే హక్కు పౌరులకు ఉందని, గడువు దాటితే సమాచారాన్ని ఉచితంగా అందించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**బైట్: ఆర్టిఐ కమిషనర్**

పీటీసీ పెద్దపల్లి

**కోమటి రెడ్డి**

ఈ నెల 18న చేపట్టాలనుకున్న చలో హైదరాబాద్ నిరసనను విరమించుకోవాలని కాంట్రాక్టర్లను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. పెండింగ్ బిల్లులను 3 నెలలలోగా చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ల ప్రతినిధులతో చర్చలు జరిపిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా బకాయిలు పేరుకుపోయేలా చేసిందని విమర్శించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ తమ ప్రభుత్వం చెల్లింపులు చేస్తోందని అన్నారు. అలాగే 13 వేల 5 వందల కోట్లతో త్వరలోనే హ్యామ్ రోడ్లను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

పీటీసీ హైదరాబాద్

**జనగామ**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో బూత్ లెవల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్  ఝా అన్నారు. అధికారుల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 25నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒకే ఓటరుకు రెండు చోట్ల పేరు ఉండటం, మరణించిన వారి వివరాలు, అలాగే వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు.

పీటీసీ జనగామ

**హనుమకొండ జిల్లా కలెక్టర్**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల పూడికతీత పనులను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ , మున్సిపల్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్పాయ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని జవహర్ కాలనీ, నయీం నగర్ సహా పలు ప్రాంతాలలో ఆమె స్వయంగా క్షేత్రస్థాయి పర్యటన చేసి , ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసేందుకు , పెండింగ్‌లో ఉన్న పనులను

తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట్ల నాలాలను మరింత లోతుగా చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పీటీసీ హన్మకొండ

**హరీష్ రావు**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కన పెట్టి కేవలం అవినీతి, అక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు విమర్శించారు. కరీంనగర్ జిల్లా అలుగునురులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యవసర సరుకుల పంపిణీ, గురుకుల విద్యార్థుల భోజనాలు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో భారీగా అవినీతి జరుగుతోందని హరీష్ రావు ఆరోపించారు.

పీటీసీ కరీంనగర్

**DOST**

డిగ్రీ కళాశాలల్లో దోస్త్ మూడవ విడత అడ్మిషన్ల గడువును ఈనెల 22 వరకు పొడగించినట్లు జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎ.మీనాక్షి తెలిపారు. జూన్ 15 నుంచి 21 వరకు 400 రూపాయల రుసుముతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, వెబ్ ఆప్షన్ల నమోదుకు జూన్ 22 వరకు అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.

పీటీసీ గద్వాల్

**AIIMS**

బీబీనగర్ ఎయిమ్స్‌లో మౌలిక సదుపాయాలు, కొత్త ప్రాజెక్టులపై పురోగతిని సమీక్షించడానికి ఉన్నత స్థాయి స్టాండింగ్ ఎస్టేట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొ.అమితా అగర్వాల్

హాజరయ్యారు. సేవాదాన్ ఆరోగ్య ఫౌండేషన్ సహకారంతో ఒకటవ గేటు సమీపంలో రోగుల సహాయకుల కోసం విశ్రామ్ సదన్ వసతి గృహాన్ని నిర్మించాలన్న ప్రతిపాదనపై చర్చించి, ఆమోదం తెలిపారు.

డెస్క్

**యోగా**

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రి సూపరింటెంట్ సురేష్ స్పష్టం చేశారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లాలో ఆయుష్ విభాగం అధికారులు సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఈరోజు ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రి ఆవరణలో ఆయుష్ విభాగం యోగా ట్రైనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో యోగా వాక్ నిర్వహించి , యోగా సాధన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

పీటీసీ ములుగు

**వాతావరణం**

రాగల కొన్ని రోజుల పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతాయని, ఆదిలాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉంది. గురువారం నాటికి రంగారెడ్డి, హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో గంటకు 50 కి.మీ వేగంతో ఈదురు గాలులతో కూడిన మెరుపులు, ఉరుములు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

డెస్క్

**ఉద్యానవన విశ్వవిద్యాలయం**

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సంగారెడ్డి ఫల పరిశోధనా కేంద్రం , యంత్రాలను ఉపయోగించి మామిడి తోటలలో శాస్త్రీయ పద్ధతిలో కొమ్మలను కత్తిరించడంపై ఒక ప్రదర్శన-శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

**పీటీసీ సంగారెడ్డి**

**బ్యాంకు రుణాలు**

రైతులు సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించి తిరిగి పొందవచ్చని మల్దకల్ మండలం ఎల్కూరు గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎల్కూరు శాఖ మేనేజర్ మధు మోహన్ రెడ్డి తెలిపారు. తమ బ్యాంకు పరిధిలో రైతులకు ఎప్పటికప్పుడు రుణాలు రెన్యువల్ చేయడం జరుగుతుందని, అలాగే కొత్త రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు.

పీటీసీ జోగులాంబ గద్వాల